# గమ్యం తెలియని పరుగు



**జిల్లేళ్ళ బాలాజీ**

హోటల్‌లో కష్టమర్లు తినేసిన ఎంగిలాకులను కుప్పతొట్టిలో పడేసి ఖాళీ గంపతో వెనుదిరిగాడు నారాయణ.

అసెంబ్లీలోని ఆస్తులపైకి విరుచుకుపడే ఎమ్మెల్యేలా విస్తర్లపైకి లంఘించాయి ఊరకుక్కలూ, పందులూను.

ఓ తెల్లటి అంబాసిడర్ కారు ఆ హోటల్ ముందుకు దూసుకొచ్చింది. సూర్యుని కిరణాలు పడి ఆ కారు ఇంకా ధగధగ మెరిసిపోతోంది.

లోన ఏం చేస్తున్నా కనబడని అద్దాలు. చెమటలు కారకుండా ఉండేందుకు ఎ.సి. చేయబడ్డ కారు.

సరిగ్గా ఇంటి ముందుకొచ్చి అడుక్కునే బిచ్చగాడిలా హోటల్ ముందుకొచ్చి ఆగింది కారు.

డ్రైవర్ గబగబా కిందకు దిగి డోర్ తీసి పట్టుకున్నాడు. కారులో నుండి ఓ ఆజానుబాహుడు హుందాగా కిందకు దిగాడు.

నిదానంగా గమనిస్తే, ఆ కారు ముందు భాగాన ఎర్రటి అక్షరాలతో 'ప్రభుత్వ వాహనము' అన్న అక్షరాలు కనిపిస్తాయి.

కనుల ముందు నిలిచిన దేవుణ్ణి కళ్ళార్పకుండా చూసినట్టు ఆ ఆజానుబాహుణ్ణి అబ్బురంగా చూశాడు నారాయణ.

వాడికి పన్నెండేళ్ళుంటాయి. లోకం తెలియని పసివాడు. ఇంత తిండి దొరుకుతుందని వాణ్ణి హోటల్‌లో చేర్పించింది వాళ్ళ అమ్మ.

కర్తవ్యం గుర్తుకొచ్చి చకచకా హోటల్‌లోకి వెళ్ళాడు. ఓ మూల గంపను కుదేసి, టేబుల్ క్లీన్ చేసే తడిగుడ్డను, ఎంగిలి విస్తళ్ళను తీయటానికి బకెట్‌ను తీసుకుని పనిలో పడ్డాడు.

కారులో నుండి దిగిన ఆ ఆజానుబాహుడి పేరు మోహనరావు.అతను ఒక ప్రభుత్వ అధికారి.

ఆర్డరిచ్చిన భోజనం సర్వర్ తెచ్చేంత వరకూ చుట్టూ గమనిస్తూ కూర్చున్నాడు.

అప్రయత్నంగా అతడి చూపులు పురుగుమీద పడ్డ బల్లి చూపులా నారాయణ మీద పడింది.దాంతో ఇక పనేమీ లేనట్టు వాడి చర్యలను గమనిస్తూ కూర్చున్నాడు.

ఇంతలో భోజనం వచ్చింది. భోజనం చేస్తూ నారాయణను ఓరకంట కనిపెడుతూనే ఉన్నాడు మోహనరావు.

భోజనం ముగించి క్యాష్ కౌంటర్ దగ్గరకు వెళ్ళి చేత్తో నారాయణను చూపిస్తూ హోటల్ ప్రొప్రయిటర్‌ను అడిగాడు.

"వాడి పేరేమిటి?"

"నారాయణ సార్!"

"వాడికి ఎన్నేళ్ళు ఉంటాయనుకుంటున్నావు?"

మౌనం వహించాడు ప్రొప్రయిటర్.

"ఆ వయస్సులో వాడు స్కూలుకెళ్ళి చదువుకోవాలి. అవునా? కానీ వాడు ఇలా క్లీనర్ పనులకు ఎగబడితే మీరూ పని ఇచ్చేయటమేనా? వాడి బాల్యం ఎంతగా నలిగిపోతోందో చూశావా? పిల్లల్ని కూలీలుగా, కార్మికులుగా తీసుకోకూడదని ప్రభుత్వం ఎంతగా ఘోషిస్తోందో మీకేమీ అర్థం కావడంలేదు. పూటకింత తిండి దొరికినా చాలని వాళ్ళ తల్లిదండ్రులు ఇలా సమాజంపైకి తోలేస్తున్నారు. వాళ్ళను ఎవరు కనమన్నారు అంతమందిని? ఆఁ...! ప్రభుత్వ ఆశయాలూ,